# సుశీల

సంధ్య చీకట్లు అప్పుడప్పుడే అలుముకుంటున్నాయి. పొడవాలా వద్దా అన్న సందేహంతో ఒక్కో చుక్కే పొడుస్తోంది. అమావాస్య పోయి మూడు రోజులవడం వల్ల నెలవంక వెండి తీగలా మెరిసిపోతూ వుంది. మా ఇంటి ముందు కేన్ కుర్చీ వేసుకుని ఆ దృశ్యాన్నే చూస్తూ కూచున్నాను.

"అక్కా! చూడక్కా! శీనుగాడు కొత్తున్నాడు" అంటూ నా దాపుకు వచ్చింది అయిదేళ్ళ ఉష. అది ఎఱ్ఱటి బుల్లిగౌను వేసుకుని ఉంది. శీనుగాడు తప్పటడుగులు వేసుకుంటూ ఆ పిల్లను కొట్టేందుకు ఎండిన కొబ్బరాకును ఎత్తి పట్టుకుని నా దగ్గరకు చేరుకున్నాడు.

"రేయ్ శ్రీనూ తప్పురా! అక్కయ్యను కొట్టొచ్చా - నువ్వు మంచోడివంట" అంటూ వాడిని ఉబ్బేస్తూ వాడి భుజం పట్టుకుని ఆపాను. అట్లా వాడిని ఆపి, నీతిని బోధించినందుకు నాకూ ఒక దెబ్బవేసి ఆపి, ఆ పిల్లవేపు తిరిగాడు. అది కిలకిల నవ్వుతూ 'అక్కా' వాన్ని రానియ్యొద్దు, అట్లే పట్టుకో" అంటూ వాళ్ళింట్లోకి పారిపోయింది. దాంతో వాడు ఏడుపు మొదలుపెట్టాడు.

"ఏడ్వద్దులేరా! పో" అంటూ వాడిని వదిలేశాను. వాడు వెంటనే పోకుండా - మరోసారి కొబ్బరాకుతో నన్ను శిక్షించి, మరీ పోయాడు.

నేను ఇక్కడికి దగ్గరలోని రాప్తాడు గ్రామం, జిల్లా పరిషత్ హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నాను. మావారు - తిరుపతి కాలేజీలో లెక్చరరు. జిల్లానుంచి జిల్లాకు బదిలీలు ఎప్పుడు అవుతాయా, అని గత రెండేళ్ళుగా ఎదురు చూడడంతోనే సరిపోయింది. ఏ పండగలకో, సెలవులకో నేను తిరుపతికి వెళ్తాను. లేదంటే ఆయనే ఇక్కడికొస్తారు. అమ్మానాన్నలు మా పల్లెలో ఉన్నారు.

పగలంతా స్కూల్లో పాఠాలు చెప్పి, ఇంటి కొస్తూనే వంటరితనం అనుభవించే నాకు ఉషా శ్రీనూలతోనే కాలక్షేపం. ఇక ఆదివారమైతే వీళ్ళిద్దరికి తోడు వీళ్ళన్నయ్య శేఖర్. వాడూ పొద్దున్నించి రాత్రిదాకా నాతోటే - వాళ్ళ ఆటలూ, పాటలూ తిండీ

తిప్పలూనూ. వాళ్ళు నా గదిలో ఉన్నారూ అంటే వాళ్ళమ్మ రుక్మిణి వాళ్ళ గురించి అసలు పట్టించుకోదు. ఎప్పుడయినా నాతో మాట్లాడేదానికి వచ్చినపుడు కూడా ఎవరి పిల్లల్నో మాట్లాడించినట్లు మాట్లాడిస్తుంది. ఆ పిల్లలు పుస్తకాల్ని చించేస్తూ ఉంటే కూడా పట్టించుకోదు. పైగా ఫిర్యాదు చేస్తుంది నాకు – 'రాజ్యం! ఆ పుస్తకాన్ని శీనుగాడు చించేస్తా ఉన్నాడు చూడూ' అంటూ.

రుక్మిణి నాకంటే ఏడేళ్ళు పెద్దదయి ఉండవచ్చు. వాళ్ల ఆయన ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంటు.

రైలు ఇంజను జారవిడచిపోయిన పెట్టెల్లాగు ఉంటాయి. మేము ఉంటున్న నాలుగు ఇళ్లూ. నేను అద్దెకుంటున్నది మొదటి ఇల్లు. రెండో ఇంట్లో రుక్మిణి వాళ్లు. మూడు ఇంట్లో బట్టలకొట్లోపని చేస్తున్న ఉద్యోగి కుటుంబం. ఇక నాలుగో ఇంట్లో సుశీల వాళ్ళు. ఆ అమ్మాయి తండ్రితో ఉంటోంది.

సుశీల నాకంటే రెండు మూడేళ్ళు చిన్నదయి వుంటుంది. ఆమె ఏదో స్వచ్ఛంద సంస్థలో పని చేస్తోందని రుక్మిణక్కే చెప్పింది. ఆ అమ్మాయి ఎప్పుడూ మగవాళ్ళతో తిరుగుతుందనీ, ఇది భరించలేక పెళ్ళయిన సంవత్సరానికే మొగుడు విడాకులిచ్చేశాడనీ కూడా చెప్పింది.

మాతో ఎవ్వరితో ఆ అమ్మాయి ఎప్పుడూ మాట్లాడేది కాదు. ఎప్పుడయినా నాకు ఆమెని పలకరించాలని అనిపించినా ఆ అవకాశం రాకుండా చూసేది రుక్మిణక్క 'బజారుదాంతో నీకు మాటలేంది' అనేది.

'సుశీల మొగుడు మంచివాడు కాదేమో' అనని ఓసారి నేను అనబోతే.

'రాజ్యం నీకు లోకం పోకడ తెల్దు, గమ్మునుండు' అంటూ నన్ను అదరగొట్టేది. అట్లా సుశీల మీద తనూ అసహ్యాన్ని పెంచుకుంటూ, నాలో కూడా పెరిగేలా చూసేది రుక్మిణక్క.

అదిగో... ఊదారంగు చీర కట్టుకుని, అదే రంగు బ్లౌజు వేసుకుని, సినీ స్టార్లా మేకప్ అయి వస్తోంది సుశీల. ఆమె రోడ్డుమీదకి పోవాలంటే మా యింటి ముందునించే పోవాలి.

టకటకా అడుగులేస్తూ వెళ్ళిపోయింది సుశీల.

ఇంక రెండు సెకనులలో రుక్మిణక్క వస్తుంది. అంత కచ్చితంగా ఎట్లా చెప్పగలుగుతున్నానంటే – 'సూర్యుడు తూర్పున ఉదయించును – పున్నమినాడే చంద్రగ్రహణం పట్టును' అన్నవి ఎంత కచ్చితంగా జరిగే విషయాలో... సుశీల అట్లా వెళుతూనే, రుక్మిణక్క ఇట్లా రావడమన్నది అంతే కచ్చితంగా జరిగే విషయమన్నమాట!

వచ్చింది రుక్మిణక్క. సుశీల వెళ్ళిన వైపే చూస్తూ ఉంది.

"ఈ పొద్దు మధ్యాహ్నం ఏం జరిగిందనుకుంటివి రాజ్యం!" అంటూ మొదలు పెట్టింది.

'కూచోక్కా! ఏం జరిగింది' అంటూ ఎదురుగానుండే కుర్చీ చూపించాను.

"మా ఆయనకి భోజనం వడ్డిద్దామని వంటింట్లోకి పోయినా. బయటినుంచి శీనుగాని ఏడుపు గట్టిగా వినిపించింది. నేను సస్తా బతుకుతా బయటికొస్తిని. అప్పటికే

మా ఆయన అక్కడున్నాడు. ఈ వగలాడేమో శీనూని మా ఆయనకి అందిస్తూ 'మా గడపమాను దగ్గిర జారిపడినాడండీ.' అంది నవ్వుతూ.

మా ఆయనయితే ముప్పయి రెండు పండ్లూ బయటపెట్టి - 'అట్లనా! చిన్నపిల్లలకి నడకలో బ్యాలెన్సు ఉండదు కదండీ!" అన్నాడు. అది చూసి నా ప్రాణం ఉడికిపోయిందమ్మా! దీని వగల నవ్వులతో మా ఆయన్ని యాడ వల్లో వేసుకుంటుందోనని నా సావు."

"ఆయన అంత బలహీనుడు కాదులే రుక్మిణక్కా" అన్నాను.

"నీకేం తెల్దులే రాజ్యం - మగోళ్ళ బుద్ధులు" అనేసి లోపలికి వెళ్లిపోయింది.

వారం తర్వాత సంక్రాంతి సెలవులు మొదలవుతున్నట్టే నేను తిరుపతికి మా వారివద్దకు వెళ్లిపోయాను.

అదిగో ఇదిగో అన్నట్లే సెలవులయిపోయాయి. గడియారపు జీవితం గడపాలి గదా అన్న దిగులుతో అనంతపురానికి చేరుకున్నాను.

అప్పుడే రిక్షా దిగి ఇంటి తలుపు తీస్తూ వుంటే, బట్టలకొట్టు ఉద్యోగి భార్య వచ్చి చెప్పింది. 'వారం కిందట రుక్మిణక్క పెద్దకొడుకు శేఖర్ చనిపోయినాడని. ఆ దారుణమైన వార్తవిని కొన్ని క్షణాలు నిశ్చేష్టురాలయిపోయాను. వెంటనే తేరుకుని సామానులు బయటి గదిలోకి విసిరేసి, గబగబా రుక్మిణక్క వాళ్ళింట్లోకి పోయాను.

రుక్మిణక్క బయటి గదిలోనే పడుకుని ఉంది. మొగం పీక్కుపోయి ఉంది. కండ్లు లోతుగా గుంటలు పడ్డాయి. పోలికే లేనంతగా మారిపోయి ఉందామె. కాసేపు ఆమెవంకే చూశాను. నేను విన్నది అబద్ధమైతే బాగుండుననిపిస్తూ వుంది. ఉష, శీనూలు ఎక్కడికి పోయినారో నిశ్శబ్దం రాజ్యమేలుతున్నట్టుంది. రుక్మిణక్క పక్కనే కూచున్నాను మౌనంగా.

"ఇట్ల జరుగుతాదని అనుకోలేదమ్మా!" అంటూ ఆమె మొదలుపెట్టింది. పిల్లాడికి మామూలు జ్వరం అనుకున్నారంట. అందుకే కొంచెం నిర్లక్ష్యం చేసినారంట. అయితే అది పచ్చకామెర్లు కావడంతో - ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయిందంటూ చెప్పింది ఏడుస్తూనే - నా భుజంమీద వాలి. ఓదార్పుగా వీపుని తడుతూ ఉండిపోయినాను.

కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా దొర్లాయి. కొంచెం భారం దించుకున్న మనిషిలా కనిపించింది. మావారి గురించీ, మా అమ్మానాన్నల గురించీ అడిగింది. ఏదో పొడిపొడిగా సమాధానాలు ఇస్తూ ఉన్నాను.

"బాగున్నారా?" అన్న మాటలు విని వెనక్కి తిరిగి చూశాను.

"సుశీల" నిలుచుని ఉంది.

నిజమా, కలా? సుశీల ఇక్కడ ఉండటమేమిటీ - అదీ రుక్మిణక్క వాళ్ళింట్లో, 'నా నుంచి వెంటనే సమాధానం రాకపోయేసరికి, మళ్లీ అడిగింది. 'బాగున్నారా? ఎప్పుడొస్తిరీ' అంటూ.

'ఆ - బాగున్నానండీ. ఇప్పుడే వస్తిని' అంటూ యాంత్రికంగా జవాబు ఇచ్చాను. ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు నేను.

ఒక గాజు గ్లాసులో ఎర్రని టానిక్ తెచ్చి రుక్మిణిచేత తాగించింది సుశీల.

"కొంచెం ఉండండి కాఫీ తెస్తాను' అంటూ వంటింట్లోకి పోయింది.

నా ఆశ్చర్యాన్ని అర్థం చేసుకుందిలా ఉంది రుక్మిణక్క.

"సుశీల గురించే కదా – చెప్తా... ఈ ఊర్లో మాకు చానామంది చుట్టాలున్నారు రాజ్యం – అంతేల ఈ సందులో, కడాన మా బావ ఉండాడు. అవతల సందులో మా మరిదీ ఉండాడు. శేఖర్ చనిపోయినాడని తెలిసినాక చుట్టాలతోపాటూ వాళ్లూ ఆస్పత్రి కాడికి వచ్చినారు. సరింగ ఆరోజే మీ అన్నయ్య ఆఫీసుపనిమీద హైదరాబాదుకి పోయినాడు. ఒక్కరు గాకుంటే ఒక్కరు శవాన్ని తీసుకొని ఆటోలో కూచోరు. నన్నూ నా పరిస్థితినీ అంతసేపటినుంచీ చూస్తా ఉన్న సుశీల ముందుకొచ్చింది సూడమ్మా! పిల్లోని శవాన్ని గుండెలకి హత్తుకొని ఇంటికి తెచ్చె. నేను గోడుమంటూ ఎట్ల ఇంటికి చేరినానో ఏమో, ఆ బగమంతునికే తెల్సు. మీ అన్నయ్య మరసటి రోజు పొద్దునికే వచ్చినాడు. ఆయన నన్నేమి ఓదారుస్తాడు!

నా ఏడుపులో నేను ఉండాను. సుశీలేనమ్మా ఉషా శీనూల సంగతి చూసింది. పిల్లోని శవాన్ని స్మశానానికి తీసుకపొయ్యేవరకు ఆ పాపే ఓదార్చకుంటే, నేను లేను. యే చుట్టాలూ మమ్మల్ని పట్టించుకోలేదమ్మా. ఆరోజు నించీ ఈరోజు దంకా ఎంతో దయతో మా అందరికీ ఇంత వండిపెడతా ఉంది రాజ్యం!" అంటూ చెప్పింది రుక్మిణక్క

సుశీల కాఫీ తెచ్చి ఇచ్చింది. చిర్నవ్వుతో అందుకున్నాను. ఇన్నాళ్లూ నాణేనికి ఒకవైపు ఉన్న బొరుసునే చూసినందుకు పశ్చాత్తాపపడ్డాను.

● చినుకు – జనవరి, *2009* ●